


కెరటం న్యూస్
( సామాన్యుడి ఆయుధం )




Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక : 277 | మంగళవారం 04 నవంబర్ 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 | ఫోన్ : 9441877695

# స్థానిక సంస్థల ఎన్నికలపై మరోసారి ఉత్కంఠ

- నోటిఫికేషన్ రద్దుపై హైకోర్టులో వాదనలు
- ఎన్నికలు ఎప్పుడు..? కోర్టు ప్రశ్నల వర్షం
- ప్రభుత్వం గడువు కోరింది - ఈసీ సిద్ధమని స్పష్టం
- తదుపరి విచారణ 24వ తేదీకి వాయిదా
- బీసీ రిజర్వేషన్ల వివాదం నేపథ్యం
- 42% రిజర్వేషన్ల నిర్ణయం - న్యాయపరమైన సవాళ్లు
- హైకోర్టు తీర్పుతో ఎన్నికల నోటిఫికేషన్ ఔట్

**న్యూస్ డెస్క్, 03 నవంబర్ (కెరటం న్యూస్):** బీసీ రిజర్వేషన్ల అంశంపై నెలకొన్న సందిగ్ధత నేపథ్యంలో తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికలకు ఇచ్చిన నోటిఫికేషన్‌ను ఎన్నికల సంఘం రద్దు చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఇప్పటికే దాదాపు 3 ఏళ్లుగా వాయిదా పడుతూ వస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలు మరోసారి వాయిదాకే పరిమితమయ్యాయి. ఇక ఎన్నికలను రద్దు చేస్తూ.. ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాన్ని తెలంగాణ హైకోర్టులో సవాల్ చేయడంతో.. ఇప్పుడు విచారణ జరుగుతోంది. ఈ క్రమంలోనే తాజాగా ఈ అంశం విచారణకు రాగా.. ఎన్నికలు ఎప్పటిలోగా నిర్వహిస్తారు అనేది చెప్పాలని తెలంగాణ సర్కార్, రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ప్రశ్నలు సంధించింది. దీనికి ప్రభుత్వ లాయర్, ఈసీ స్పందించింది.

2వ



## చనిపోయిన చిన్నాన్నతో మాట్లాడాలని శవం వెలికితీసే యత్నం




**న్యూస్ డెస్క్, 03 నవంబర్ (కెరటం న్యూస్):** కాలం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో పరిగెడుతున్నా.. మూఢ నమ్మకాలు మాత్రం తగ్గడం లేదు. ఎక్కడో ఒక దగ్గర తమ ఉనికిని చాటుకుంటూనే ఉన్నాయి. అటువంటి ఘటనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్నమయ్య జిల్లాలో ఉన్న మదనపల్లె మండలంలో జరిగింది.

## స్థానిక సంస్థల ఎన్నికల కేసు..

### నవంబర్ 24కు విచారణ వాయిదా




**న్యూస్ డెస్క్, 03 నవంబర్ (కెరటం న్యూస్):** రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి విడుదల చేసిన నోటిఫికేషన్‌ను స్టేట్ ఎలక్షన్ కమిషన్ సస్పెండ్ చేస్తూ అక్టోబర్ 9న ఉత్తర్వులు జారీ చేసి విషయం తెలిసిందే. అయితే, ఆ ఉత్తర్వులను సస్పెండ్ చేయడానికి సవాలు చేస్తూ సురేందర్ అనే న్యాయవాది తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు ఆ పిటిషన్‌పై మరోసారి విచారణ చేపట్టిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది.

## రెండేళ్లలో ఎస్ఎల్‌బీసీ పూర్తి చేస్తాం

### -సీఎం రేవంత్ రెడ్డి




## ఎక్కడా నిర్లక్ష్యం చేయొద్దు..

### కాంగ్రెస్ నేతలకు మహేశ్ గౌడ్ దిశానిర్దేశం




## సర్వేలను మేం పట్టించుకోం..

### మా ధైర్యం దానిమీదే: కిషన్ రెడ్డి ధీమా




## చేవెళ్లలో ఘోర రోడ్డు ప్రమాదం

### 19 మంది మృతి




## పత్తి రైతుల గోస ప్రభుత్వాలకు పట్టదా..?




## పెట్టుబడుల ఆకర్షణే ప్రధాన లక్ష్యం..

### దుబాయ్ లో మంత్రి నారాయణ బృందం




## భారత్‌లో తాలిబన్ తొలి దౌత్యవేత్త నియామకం..

### కేంద్రం గ్రీన్ సిగ్నల్‌తో కీలక ముందడుగు




**న్యూస్ డెస్క్, 03 నవంబర్ (కెరటం న్యూస్):** భారత్, అఫ్గానిస్థాన్ మధ్య దౌత్య సంబంధాలు మరింత పుంజుకోనున్నాయి. ముఖ్యంగా అఫ్గానిస్థాన్‌లో తాలిబాన్ పాలన తిరిగి ప్రారంభమైన తర్వాత.. తొలిసారిగా అక్కడి సర్కారు భారత్‌లో తొలి దౌత్యవేత్తను నియమించబోతుంది. అది కూడా ఈనెలలోనే కాగా.. ఇది ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలలో కీలక అడుగుగా అంతా బావిస్తున్నారు. తాలిబాన్ ఈ నెలలో మొదటి దౌత్యవేత్తను నియమించిన తర్వాత.. డిసెంబర్ చివరిలో లేదా జనవరి ప్రారంభంలో మరో దౌత్యవేత్తను నియమించడానికి కాబూల్ భారత అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది.

గత ఏడాది నుంచి ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగయ్యాయి. ఈక్రమంలోనే గత నెలలో అఫ్గానిస్థాన్ విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తకి భారతదేశంలో పర్యటించారు. ఈ పర్యటన సందర్భంగా కాబూల్‌లోని తన సాంకేతిక మిషన్‌ను రాయబార కార్యాలయం స్థాయికి పెంచాలని భారతదేశం నిర్ణయించింది. అంతేకాకుండా తాలిబాన్ దౌత్యవేత్తలను అంగీకరించడానికి భారత్ సుముఖత వ్యక్తం చేసింది.

## మరో ఆరు నెలలు కాల్పుల విరమణే..

### మావోయిస్టు పార్టీ సంచలన లేఖ

**న్యూస్ డెస్క్, 03 నవంబర్ (కెరటం న్యూస్):** ఆయుధాలు వదిలేసి చర్చలకు వచ్చే విషయంలో మావోయిస్టు పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న విషయం విదితమే. ఓ వైపు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మావోయిస్టుల కాల్పుల విరమణ ప్రతిపాదనను తిరస్కరిస్తున్నట్లుగా ఇటీవల ఓ బహిరంగ సభలో స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే మరోసారి కాల్పుల విరమణపై ఇవాళ మావోయిస్టు పార్టీ కీలక ప్రకటన చేసింది. ఈ మేరకు ఆ పార్టీ అధికారిక ప్రతినిధి జగన్ పేరిట ఓ లేఖ విడుదలైంది.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా..

ఏప్రిల్, మే, జూన్ నెలల్లో తెలంగాణ రాష్ట్రంలో అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు, సామాజిక వర్గాలు శాంతియుత వాతావరణం కొనసాగాలని పెద్దఎత్తున ఉద్యమాలు చేశారని జగన్ ఆ లేఖలో ప్రస్తావించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పందించిందని తెలిపారు.




## హైదరాబాద్‌లో మరోసారి భూముల వేలం

### కోకాపేట, కూకట్‌పల్లిలో అమ్మకానికి 47 ఎకరాలు..!




**న్యూస్ డెస్క్, 03 నవంబర్ (కెరటం న్యూస్):** హైదరాబాద్ పరిధిలో మరోసారి భూముల వేలానికి హెచ్‌ఎండీఏ రంగం సిద్ధం చేసింది. నగరంలో అత్యంత కీలకమైన ప్రాంతాలైన కోకాపేటలోని నియో పోలీస్, కూకట్‌పల్లి పరిధిలో ఉన్న మూసాపేట వై జంక్షన్ వద్ద భూముల అమ్మకానికి హెచ్‌ఎండీఏ ప్రకటన విడుదల చేసింది. ఈ రెండు ప్రాంతాల్లో మొత్తం 47 ఎకరాల భూమిని వేలం వేయనున్నారు. కోకాపేట నియో పోలీస్‌లో 32 ఎకరాలు, కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద 15 ఎకరాల భూమి అమ్మకానికి సిద్ధమైంది. ఈ వేలంలో భూముల ప్రారంభ ధరను హెచ్‌ఎండీఏ నిర్ణయించింది.

## ఇందిరమ్మ ఇళ్ల కోసం సాండ్ ట్యాక్స్ యాప్..

### ఇకపై ఇంటికే ఇసుక




**న్యూస్ డెస్క్, 03 నవంబర్ (కెరటం న్యూస్):** ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే ప్రతి అంశంలోనూ పారదర్శకతను పాటిస్తూ వస్తున్న అధికారులను అక్కడక్కడ లోపాలు వెంటాడుతూనే ఉన్నాయి. అయితే.. లబ్ధిదారులకు ఇబ్బందులు ఉండొద్దనే ఉద్దేశంతో రోజుకో విధంగా కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా ఇల్లు మంజూరైన ఏ లబ్ధిదారు సైతం ఏ చిన్న కారణంతో ఇంటిని నిర్మించుకోలేని పరిస్థితి ఉండొద్దనే అధికారుల ఉద్దేశం. మరోవైపు ఇప్పటివరకు మంజూరైన ఏ లబ్ధిదారు ఇంటిని క్యాన్సిల్ చేసేది లేదని అధికారులు స్పష్టం చేశారు. అయితే.. క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు వస్తున్న ఇబ్బందులను గృహ నిర్మాణ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ వాటికి పరిష్కార మార్గాలు చూపిస్తున్నారు.

ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ముందు నుంచీ పారదర్శకంగా అమలు చేస్తూ వచ్చారు. లబ్ధిదారుల ఎంపిక నుంచి బిల్లుల చెల్లింపు వరకు ఎక్కడా అవినీతి లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా లబ్ధిదారుల ఎంపికను సైతం యాప్ ద్వారానే చేపట్టారు. చివరకు లబ్ధిదారులే తమ ఇండ్ల ఫోటోలను యాప్‌లో అప్‌లోడ్ చేసేలా అవకాశం కల్పించారు.

కెరటం న్యూస్



# మరో ఆరు నెలలు కాల్పుల విరమణే.. మావోయిస్టు పార్టీ సంచలన లేఖ

ఈ క్రమంలో గత మే నెలలో మేము 6 నెలల పాటు కాల్పుల విరమణను ప్రకటించామని పేర్కొన్నారు. అయితే, గడిచిన 6 నెలల కాలంలో అనుకున్న పద్ధతులను మా వైపు నుంచి అమలు జరిపి శాంతియుత వాతావరణం కొనసాగేలా వ్యవహరించామని తెలిపారు. ఇదే శాంతియుత వాతావరణం కొనసాగాలని తెలంగాణ సమాజం కోరుకుంటుందని అన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరో 6 నెలల పాటు కాల్పుల విరమణను ప్రకటిస్తున్నామని లేఖలో వెల్లడించారు. గతంలో కొనసాగిన విధంగానే తమ వైపు నుంచి శాంతియుత వాతావరణాన్ని కొనసాగించేందుకు కృషి చేస్తామని. ప్రభుత్వం వైపు నుంచి కూడా గతంలో వ్యవహరించిన విధంగానే ఉండాలని కోరుతున్నామని పేర్కొన్నారు.

శాంతిని భంగం చేసేలా కేంద్రం ప్రయత్నాలు..

ఇక కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న శాంతియుత వాతావరణాన్ని భంగం చేసేందుకు ప్రయత్నాలు చేస్తుందని అన్నారు. అలాంటి ప్రయత్నాలకు వ్యతిరేకంగా అన్ని పార్టీలు, అన్ని సామాజిక వర్గాలు, సంఘాలు, విద్యార్థులు, మేధావులు, ప్రజాస్వామికవాదులు ఏక కంఠంతో కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలకు వ్యతిరేకంగా పోరాడాలని కోరుతున్నామంటూ మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్ లేఖలో ప్రస్తావించారు.

# చనిపోయిన చిన్నాన్నతో మాట్లాడాలని శవం వెలికితీసే యత్నం

వివరాల్లోకి వెళ్తే మదనపల్లె మండలానికి చెందిన దిలీప్ రావ్ అనే యువకుడు బెంగళూరులో నవంబరు 1న మరణించాడు. దీంతో అతని కుటుంబ సభ్యులు స్వగ్రామానికి అతని పార్థివ దేహాన్ని తీసుకొచ్చారు. అదే రోజు సాయంత్రం మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లె మార్గంలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఇదంతా బాగానే ఉన్నా.. ఎవరో గుర్తు తెలియని వ్యక్తి శవం పూడ్చిన దగ్గరకు వచ్చి దాన్ని బయటకు తీసే ప్రయత్నం చేశాడు. అది గమనించిన సమీపంలోని పశువుల కాపర్లు అతడిని హెచ్చరించారు. దీంతో ఆ వ్యక్తి అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

కొంత సేపటికి మళ్లీ వచ్చి... చిన్నాన్నతో మాట్లాడాలని

కొద్ది సమయానికి సదరు వ్యక్తి మళ్లీ దిలీప్ రావ్ ను పూడ్చిన చోటకు వచ్చాడు. చుట్టూ ఎవరు లేనిది గమనించి మళ్లీ శవాన్ని బయటకు తీసేందుకు తవ్వడం ప్రారంభించాడు. అదే సమయంలో మృతుడి కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకున్నారు. శవాన్ని బయటకు తీయడాన్ని గమనించి ఆగ్రహానికి గురయ్యారు. శవాన్ని ఎందుకు బయటకు తీస్తున్నావని గట్టిగా ప్రశ్నించారు. అయినా సదరు వ్యక్తి నుంచి సమాధానం రాకపోవడంతో వారి కోపం కట్టలు తెంచుకుంది. ఆ వ్యక్తికి నాలుగు తగిలించడంతో అసలు విషయం బయటపెట్టాడు. తన పేరు గోవింద్ గా పేర్కొన్నాడు. తను జైపూర్ నుంచి వచ్చి మదనపల్లెలో ఉంటున్నట్లు తెలిపాడు. తన చిన్నాన్న మహేశ్ ఇటీవల మరణించాడన్నాడు. అతనితో మాట్లాడుతూ దిలీప్ రావ్ శవాన్ని వెలికి తీసే ప్రయత్నం చేసినట్లు చెప్పాడు. అందుకోసం తాంత్రిక ప్రయోగాలకు యత్నించినట్లు వెల్లడించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారని సమాచారం.

# పెట్టుబడుల ఆకర్షణే ప్రధాన లక్ష్యం..

## దుబాయ్ లో మంత్రి నారాయణ బృందం

**న్యూస్ డెస్క్, 03 నవంబర్ (కెరటం న్యూస్):** ఆంధ్రప్రదేశ్ పురపాలక, పట్టాణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ దుబాయ్ పర్యటన ప్రారంభమైంది. ఆయన బృందం దుబాయ్ కు చేరుకుంది. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే ప్రధాన లక్ష్యంగా మంత్రి నారాయణ బృందం దుబాయ్ పర్యటన సాగనుంది. విశాఖపట్నంలో నవంబరు 14, 15 తేదీల్లో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు పారిశ్రామికవేత్తలను మంత్రి ఆహ్వానించనున్నారు. పర్యటనలో భాగంగా ప్రముఖ రియాలిటీ సంస్థ శోభా గ్రూప్ డైరెక్టర్ జ్యోత్స్న హెగ్డే, హెల్త్ కేర్ సంస్థ ఆస్టర్ గ్రూప్ ప్రతినిధులతో మంత్రి భేటీ అవుతారు. కేఈఎఫ్ హోల్డింగ్స్ చైర్మన్ ఫైజల్, బుర్జీల్ హోల్డింగ్స్ ప్రతినిధులతో విడి సమావేశమవుతారు. అనంతరం దుబాయ్ ఇండియన్ కాన్సులేట్ జనరల్ సతీశ్ శివన్ తో మంత్రి నారాయణ బృందం భేటీ అవుతుంది.

పెట్టుబడులు పెట్టేందుకు ఆహ్వానం..

నవంబర్ 6 వరకు మంత్రి నారాయణ దుబాయ్ లోనే ఉండనున్నారు. సమావేశాల్లో భాగంగా దుబాయ్ పారిశ్రామికవేత్తలకు రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరిస్తారు. విశాఖపట్నంలో జరిగే సీఐఐ సదస్సుకు రావాలని ఆహ్వానిస్తారు. సదస్సు వేదికగా పెట్టుబడులు ప్రకటించాలని మంత్రి నారాయణ వారిని కోరనున్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల కోసం సాండ్ ట్యాక్స్ యాప్.. ఇకపై ఇంటికే ఇసుక



దీని ద్వారా మధ్యవర్తిత్వానికి వచ్చిన వారెవరికీ డబ్బులు ఇవ్వకుండా వెసులుబాటు లభించింది. తమ ఇంటి నిర్మాణాలను ఎప్పటికప్పుడు యాప్‌లో అప్‌లోడ్ చేసేస్తే దాని ఆధారంగా వారి ఖాతాల్లో నిధులు జమ అవుతున్నాయి. అంతేకాకుండా క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను చెప్పుకునేందుకు హైదరాబాద్‌లో కాల్ సెంటర్‌ను సైతం ఏర్పాటు చేశారు. అలాగే డబ్బులు లేని వారికి మహిళా సంఘాల ద్వారా రుణాలు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు.

కొత్తగా సాండ్ ట్యాక్స్ పాలసీ

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇసుక కోసం ఇబ్బందులు పడకుండా ఆన్‌లైన్‌లో బుక్ చేస్తే ఇంటికే వచ్చే విధానాన్ని గృహనిర్మాణ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ గనుల శాఖ కోసం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ గతంలో రూపొందించిన 'మన ఇసుక వాహనం' యాప్‌ను ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అనుసంధానించారు. ఇందులో ఉన్న సాంకేతికపరమైన అవాంతరాలను గుర్తించి, దాన్ని మరింత మెరుగ్గా రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. యాప్ ద్వారానే లబ్ధిదారులకు ఇసుక అందేలా చర్యలు చేపడుతున్నారు. ప్రధానంగా ఈ యాప్‌లో గ్రామాల్లోని ట్రాక్టర్లను ముందుగా అనుసంధానిస్తారు. లబ్ధిదారులు ఆ యాప్‌లో ఇసుక బుక్ చేసి, వాహన రవాణా చార్జీని ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుంది. ఆ ఊరికి సంబంధించి యాప్‌లో ఉన్న వాహనం వెళ్లి ఇసుకను తీసుకొచ్చి లబ్ధిదారుకు అందిస్తుంది. ఇందిరమ్మ పథకం కింద లబ్ధిదారులకు ఇసుకను ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వం గతంలోనే నిర్ణయించింది.

కేవలం ఇసుక రీచ్ లేదా ఇసుక బజార్ లేదా ఇసుక డంప్ నుంచి ఇసుకను తరలించే ట్రాక్టర్‌కు రవాణా చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఈ చార్జీల్లోనూ ట్రాక్టర్ల యజమానులు ఇష్టారీతిన డిమాండ్ చేస్తున్నారు. ఇదే అంశం అధికారుల దృష్టికి రావడంతో ఈ కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించారు. అంతేకాకుండా చార్జీలను సైతం అధికారులే ఖరారు చేసి యాప్‌లో పొందుపరుస్తారు. ఇసుక బుక్ చేసుకున్న లబ్ధిదారు ఇల్లు ఇసుక బజార్ నుంచి ఎంత దూరం ఉన్నది? దానికి చార్జి ఎంతనో యాప్‌లోనే తెలిసిపోతుంది. ఆ మొత్తాన్ని చెల్లించి ఇసుక పొందచ్చు. దీనికితోడు కొంతమంది గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అంటూ ఇసుకను అక్రమ తరలింపునకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇష్టారాజ్యంగా డంపులు పెట్టి అమ్ముకుంటున్నారన్న విషయం అధికారుల దృష్టికి వచ్చింది. దాంతో ఈ యాప్ ద్వారా ఈ అక్రమాలన్నింటికీ చెక్ పెట్టొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే త్వరలో యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది.

# భారత్‌లో తాలిబన్ తొలి దౌత్యవేత్త నియామకం..

## కేంద్రం గ్రీన్ సిగ్నల్‌తో కీలక ముందడుగు

త్వరలో ఇరుపక్షాలు తమ తమ మిషన్లకు ఛార్జ్ డి అఫైర్స్ స్థాయి అధికారిని నాయకత్వం వహించేలా చర్యలు తీసుకోనున్నాయి.

నమ్మకమైన భాగస్వామిగా భారత్

తాలిబాన్ ప్రభుత్వాన్ని భారత్ ఇంకా అధికారికంగా గుర్తించనప్పటికీ.. అఫ్గానిస్థాన్?కు సహాయం అందించడంలో భారత్ నమ్మకమైన భాగస్వామిగా తన పాత్రను బలోపేతం చేసుకుంది. నిరంతరాయంగా అందిస్తున్న మానవతా సహాయం, వైద్య సామాగ్రి సరఫరా దీనికి నిదర్శనంగా నిలుస్తోంది. అయితే తాజాగా భారత్ 16 టన్నులకు పైగా వ్యాధి నిరోధక మందులను అఫ్గానిస్థాన్‌కు విరాళంగా అందించగా.. తాలిబన్ ప్రతినిధి దీన్ని ప్రశంసించారు. "ఈ విరాళం అఫ్గానిస్థాన్‌కు భారతదేశం అందిస్తున్న దీర్ఘకాలిక భాగస్వామ్యాన్ని, అభివృద్ధి మద్దతును నొక్కి చెబుతోంది. ముఖ్యమైన వైద్య సామాగ్రిని అందిస్తూ మానవతా సహకారాన్ని ప్రోత్సహించడంలో భారత్ విశ్వసనీయ భాగస్వామిగా తన పాత్రను పోషిస్తోంది" అని ఆ ప్రతినిధి పేర్కొన్నారు.

పాక్‌తో ఉద్రిక్తతలు.. భారత్‌కు మద్దతు

అలాగే ముత్తకీ తన భారత పర్యటన సమయంలో.. జమ్మూ కాశ్మీర్‌పై భారత సార్వభౌమత్వాన్ని సమర్థించారు. భారత గడ్డపై నిలబడే పాక్ ప్రభుత్వానికి హెచ్చరికలు కూడా జారీ చేశారు. ముఖ్యంగా పాక్-అఫ్గాన్ దేశాలు కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్నప్పటికీ.. ఉద్రిక్తతలు పెరిగే ముప్పు ఇంకా పూర్తిగా తొలగిపోలేదు. చూడాలి మరి ముమ్ముందు ఏం జరగబోతుందనేది.

# స్థానిక సంస్థల ఎన్నికల కేసు..

## నవంబర్ 24కు విచారణ వాయిదా



**న్యూస్ డెస్క్, 03 నవంబర్ (కెరటం న్యూస్):** రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి విడుదల చేసిన నోటిఫికేషన్‌ను స్టేట్ ఎలక్షన్ కమిషన్ సస్పెండ్ చేస్తూ అక్టోబర్ 9న ఉత్తర్వులు జారీ చేసి విషయం తెలిసిందే. అయితే, ఆ ఉత్తర్వులను సస్పెండ్ చేయడానికి సవాలు చేస్తూ సురేందర్ అనే న్యాయవాది తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు ఆ పిటిషన్‌పై మరోసారి విచారణ చేపట్టిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలని ప్రభుత్వంతో పాటు, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ధర్మాసనం ప్రశ్నించింది. అయితే, వాదనల సందర్భంగా ప్రభుత్వం తరఫు న్యాయవాది ఎన్నికల నిర్వహణపై బెంచ్‌కు తమ అభిప్రాయం తెలిపేందుకు మరింత గడువు కావాలని కోరారు. మరోవైపు ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా తెలిపింది. దీంతో కేసులో తదుపరి విచారణకు ధర్మాసనం ఈ నెల 24కు వాయిదా వేసింది.

# హైదరాబాద్‌లో మరోసారి భూముల వేలం..

## కోకాపేట, కూకట్‌పల్లిలో అమ్మకానికి 47 ఎకరాలు..!

**న్యూస్ డెస్క్, 03 నవంబర్ (కెరటం న్యూస్):** హైదరాబాద్ పరిధిలో మరోసారి భూముల వేలానికి హెచ్ఎండీఏ రంగం సిద్ధం చేసింది. నగరంలో అత్యంత కీలకమైన ప్రాంతాలైన కోకాపేటలోని నియో పోలీస్, కూకట్‌పల్లి పరిధిలో ఉన్న మూసాపేట వై జంక్షన్ వద్ద భూముల అమ్మకానికి హెచ్ఎండీఏ ప్రకటన విడుదల చేసింది. ఈ రెండు ప్రాంతాల్లో మొత్తం 47 ఎకరాల భూమిని వేలం వేయనున్నారు.

కోకాపేట నియో పోలీస్‌లో 32 ఎకరాలు, కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద 15 ఎకరాల భూమి అమ్మకానికి సిద్ధమైంది. ఈ వేలంలో భూముల ప్రారంభ ధరను హెచ్ఎండీఏ నిర్ణయించింది. కోకాపేట నియో పోలీస్‌లో ఎకరా ప్రారంభ ధర రూ. 99 కోట్లుగా, కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద ఎకరా ప్రారంభ ధర రూ. 75 కోట్లుగా నిర్ణయించారు. ఈ భూముల వేలం ద్వారా దాదాపు 4,000 కోట్ల రూపాయల ఆదాయం వస్తుందని హెచ్ఎండీఏ అంచనా వేస్తోంది.

ఈ వేలం పాట ఆన్‌లైన్‌లో జరగనుంది. ఇందుకు సంబంధించి నవంబర్ 24, 28, డిసెంబర్ 3, 5 తేదీల్లో ఈ భూముల వేలంపాట తేదీలను కూడా హెచ్ఎండీఏ ప్రకటించింది. ఈ కీలక ప్రాంతాల్లో జరుగుతున్న భూముల వేలం రియల్ ఎస్టేట్ రంగంలో మరోసారి ఉత్సాహాన్ని నింపుతుందని భావిస్తున్నారు.

# రెండేళ్లలో ఎస్ఎల్‌బీసీ పూర్తి చేస్తాం సీఎం రేవంత్ రెడ్డి

**న్యూస్ డెస్క్, 03 నవంబర్ (కెరటం న్యూస్):** నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాలలో మూడు లక్షల ఎకరాలకు సాగునీరు, 30 లక్షల ప్రజానీకానికి తాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన ఎస్ఎల్‌బీసీ పనులను రెండు సంవత్సరాలలో పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నిరంతరాయంగా సాగుతున్న ఎస్ఎల్బీసీ సొరంగం కూలి.. 8 మంది సజీవ సమాధి అయినా నేపథ్యంలో నిలిచిపోయిన పనులను చేపట్టడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, వెంకట్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, దేవరకొండ ఎమ్మెల్యే వాళ్లు నాయక్ తదితరులతో కలిసి టన్నెల్‌ను పూర్తి చేసుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలను గురించి హెలి మాగ్నెటిక్ సర్వే వివరాలను నిపుణులతో కలిసి పరిశీలించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు.

1983లో మంజూరు అయిన ఎస్ఎల్బీసీ 2004- 05 సంవత్సరాలలో రెండువేల కోట్ల అంచనాలతో పనులు ప్రారంభం అయ్యాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలు అధికారంలో ఉండి ఈ ప్రాజెక్టును పూర్తి చెయ్యలేదు అని ముఖ్యమంత్రి చెప్పారు. ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్, హరీష్ రావు పాలమూరు, నల్గొండ జిల్లాలకు తీరని అన్యాయం చేశారని ముఖ్యమంత్రి ఆరోపించారు. 42 కిలోమీటర్లు ఉన్న ఎస్ఎల్బీసీ ఇంకా 9.8 కిలోమీటర్ల పొడవున్న పొడవున టన్నెల్ పనులను కొనసాగించే క్రమంలో టన్నెల్‌లో కూలిపోవడంతో పనులు ఆగిపోయాయి. ఇప్పుడు ఆ పనులను పూర్తి చేయాలి అన్న ఉద్దేశంతో అత్యాధునిక ఏరియల్ ఎలక్ట్రో మాగ్నెటిక్ ద్వారా సర్వే చేయిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. 800 మీటర్ల నుండి 1000 మీటర్ల లోపల వరకు ఉన్న పరిస్థితులను అంచనా వేయడానికి అవకాశం ఉంటుంది అన్నారు.

ఎస్ఎల్బీసీకి 4600 కోట్లు మంజూరు అయ్యాయి. ఈ విధులతోనే పనులు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. గతంలో తెలంగాణ ప్రభుత్వం కృష్ణా నదిలో 811 పీఎంసీల నికర జలాలలో 512 టీఎంసీల నికర జలాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కేటాయించి.. మనకు మాత్రం 299 టీఎంసీలు చాలు అని ఒప్పందం కుదుర్చుకున్నారు. పైగా ఉమ్మడి పాలమూరు జిల్లాలో చేపట్టిన ఒక్క ప్రాజెక్టు పనిని కూడా పూర్తి చేయలేదు. ఇప్పుడు మనము పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తూ ఉంటే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అడుగడుగునా ఆటంకాలు కలిగిస్తుంది అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా నుండి ఎంపికైన నేను రాష్ట్ర ముఖ్యమంత్రిగా, నల్గొండ జిల్లా నుండి ఎంపికైన ఉత్తమ్ కుమార్, కోటిరెడ్డి వెంకట్రెడ్డి మంత్రులుగా ఉన్నారు. ఇప్పుడు ఈ ప్రాజెక్టులను పూర్తి చేసుకోకుంటే మమ్మల్ని ప్రజలు క్షమించరు. ఇప్పుడు చేసుకోకుంటే ఎప్పటికీ చేయలేము. ఎవరు అడ్డు వచ్చినా ప్రాజెక్టులను పూర్తిచేసే తీరుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# ఎక్కడా నిర్లక్ష్యం చేయొద్దు.. కాంగ్రెస్ నేతలకు మహేశ్ గౌడ్ దిశానిర్దేశం

**న్యూస్ డెస్క్, 03 నవంబర్ (కెరటం న్యూస్):** జూబ్లీహిల్స్ ఉపఎన్నికలపై గాంధీ భవన్‌లో టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జులు, బూత్ పరిశీలకులతో పాటు ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రి కొండా సురేఖ, ఏఐసీసీ కార్యదర్శులు విశ్వనాథన్, సంపత్ కుమార్ ఎంపీలు ఎమ్మెల్యేలు, చైర్మన్‌లు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ గౌడ్ మాట్లాడారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ విజయం ఖాయమైందని జోస్యం చెప్పారు. కాంగ్రెస్‌కు మంచి అనుకూల వాతావరణం ఏర్పడిందని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరూ చిన్న తప్పిదం కూడా చేయొద్దని సూచించారు. ఎన్నికల వ్యూహాలు పకడ్బందీగా ఉండాలని ఆదేశించారు. రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమాన్ని చేసి చూపించామని అన్నారు. మనం చేసిన అభివృద్ధి పెద్దఎత్తున ప్రచారం చేసుకుంటే మన విజయాన్ని ఎవరు ఆపలేరని అన్నారు. ఎన్నికల బాధ్యతలు తీసుకున్న నాయకులు వారి బాధ్యతలు ఎక్కడా చిన్న నిర్లక్ష్యం చేయకుండా పని చేయాలని సూచించారు. ఈ వారం రోజులు చాలా కీలకమని అన్నారు. ఇంటింటి ప్రచారం చేయాలి.. మీరంతా చాలా అనుభవజ్ఞులైన నాయకులు మీరు ఓటర్లను ఎలా కాంగ్రెస్ వైపు నడపాలో మీకు బాగా తెలుసు.. గెలుపే లక్ష్యంగా, ప్రతీ నాయకుడు తానే అభ్యర్థిని అన్నట్టుగా పని చేయాలి. ఫలితం మనకు అనుకూలంగా రావడం ఖాయం. మంచి మెజారిటీ కూడా రావాలని దిశానిర్దేశం చేశారు.

# స్థానిక సంస్థల ఎన్నికలపై మరోసారి ఉత్కంఠ

తెలంగాణలో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం అక్టోబర్ 9వ తేదీన రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను సురేందర్ అనే న్యాయవాది తెలంగాణ హైకోర్టులో సవాల్ చేస్తూ ఒక పిటిషన్‌ను దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై తాజాగా మరోసారి కోర్టు విచారణ చేపట్టి.. కీలక వ్యాఖ్యలు చేసింది. స్థానిక ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలని ప్రభుత్వంతో పాటు, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ధర్మాసనం ప్రశ్నించింది.

ఈ ప్రశ్నకు స్పందించిన తెలంగాణ ప్రభుత్వం తరఫు లాయర్.. ఎన్నికల నిర్వహణపై బెంచ్‌కు తమ అభిప్రాయం చెప్పేందుకు మరింత గడువు ఇవ్వాలని కోరారు. ఇక ఇదే ప్రశ్నపై స్పందించిన రాష్ట్ర ఎన్నికల సంఘం.. ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపింది. రెండు వైపులా వాదనలు విన్న తెలంగాణ హైకోర్టు .. ఈ కేసులో తదుపరి విచారణకు ఈ నెల 24వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. అప్పటిలోగా ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం స్పష్టమైన అభిప్రాయాన్ని కోర్టుకు సమర్పించాల్సి ఉంటుంది.


తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం.. హైకోర్టు, సుప్రీంకోర్టు వద్దకు చేరింది. ఈ క్రమంలోనే హైకోర్టును ఆశ్రయించాలని.. సుప్రీంకోర్టు సూచించగా.. ఎట్టకేలకు హైకోర్టు తుది తీర్పు వెలువరించింది. ఈ తీర్పు తెలంగాణ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రావడంతో.. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం రద్దు చేసిన విషయం తెలిసిందే.

# సర్వేలను మేం పట్టించుకోం..

## మా ధైర్యం దానిమీదే: కిషన్ రెడ్డి ధీమా

**న్యూస్ డెస్క్, 03 నవంబర్ (కెరటం న్యూస్):** జూబ్లీహిల్స్ ఉపఎన్నిక(ప్రచారంలో భాగంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మీడియా ప్రతినిధులతో సోమవారం చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్‌లో మాకు టీడీపీ మద్దతు ఉందని స్పష్టం చేశారు. టీడీపీ ఒక్కటే కాదని.. ఎన్డీఏ కూటమిలోని పార్టీలన్నీ తమకు మద్దతు ఇస్తున్నాయని చెప్పారు. ఎన్నికల వేళ తాము ఎప్పుడూ సర్వేలు చేయించుకోలేదని.. తాము సర్వేలను నమ్మే బ్యాచ్ కాదని.. ఇంటింటి ప్రచారాన్ని, బీజేపీ కేడర్‌ను నమ్ముతామని అన్నారు. 2023లో టికెట్ ఇస్తే గెలువని ఆజార్‌కు మంత్రి పదవి ఇచ్చారని విమర్శించారు. ఇది చేస్తాం.. అది చేస్తాం.. అని అమలుకు సాధ్యం కానీ హామీలు ఇవ్వడం మాకు చేతకాదని.. చేసే పనులే చెప్తామని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎవరు మాట్లాడినా.. బీజేపీపై విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్‌లో త్రిముఖపోటీ ఉంది కాబట్టి బీజేపీ గెలుస్తుందని జోస్యం చెప్పారు. ఈ ఉపఎన్నిక దేనికీ ప్రాధాన్యం కాదు.. ప్రజలు విజ్ఞులు.. ఎప్పుడు ఏ పార్టీని ఆదరించాలో వారికి తెలుసని అన్నారు. బీసీలకు న్యాయం జరగాలి.. రాజకీయంగా ఎదగాలని తాను కోరుకుంటానని చెప్పారు. జూబ్లీహిల్స్‌తో పాటు బిహార్‌లో కూడా ఖచ్చితంగా గెలుస్తామని దీమా వ్యక్తం చేశారు.

# చేవెళ్లలో ఘోర రోడ్డు ప్రమాదం.. 19 మంది మృతి



**న్యూస్ డెస్క్, 03 నవంబర్ (కెరటం న్యూస్):** హైదరాబాద్ –బీజాపూర్ జాతీయ రహదారి 163 పై మీర్జాగూడ వద్ద ఈరోజు ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం గురించి తెలిసిందే. ఆర్టీసీ బస్సును మితిమీరిన వేగంతో టిప్పర్ ఢీకొన్నది. ఈ ప్రమాదంలో 19 మంది మరణించగా పదుల సంఖ్యలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే ఈ ఘటనలో స్వల్ప గాయాలతో తృటిలో తప్పించుకున్న ఆ బస్ కండక్టర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ... మీడియాతో మాట్లాడారు. బస్సు మీర్జాగూడ వద్దకు రాగానే ఒక్క క్షణం ఏం జరుగుతుందో అర్థం కాలేదని, కన్నుమూసి తెరిచేలోపు ఘోరం జరిగిపోయిందని కన్నీళ్లు పెట్టుకున్నారు. బస్సులో పోలీసులు, ఉద్యోగులు సహా మొత్తం 72 మంది ప్రయాణికులు ఉన్నట్లు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లాలో చేవెళ్ల మండలం మీర్జాగూడ సమీపంలో తాండూరు డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సును కంకర లోడుతో వెళ్తున్న లారీ ఢీకొట్టింది.బస్సుపై కంకర లోడు పడిపోవడంతో పలువురు ప్రయాణికులు దాని కింద కూరుకుపోయారు. ఈ ప్రమాదంలో 19 మంది మృతి చెందగా.. 20 మంది తీవ్రంగా గాయడ్డారు.

# పత్తి రైతుల గోస ప్రభుత్వాలకు పట్టదా..?

**న్యూస్ డెస్క్, 03 నవంబర్ (కెరటం న్యూస్):** ఆదిలాబాద్ జిల్లాలో పత్తి రైతులు గోసపడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని, ఇక్కడున్న బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు కూడా విఫలమయ్యారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. జాగృతి జనంబాటలో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ పత్తి మార్కెట్ యార్డులో రైతులతో ఆమె మాట్లాడారు.. వర్షాలతో పత్తి పంట తీవ్రంగా దెబ్బతిన్నదని ఇటు మద్దతు ధర కూడా లేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆమెకు వెలిబుచ్చారు. పత్తిలో తేమశాతం పేరుతో కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. 20 శాతం తేమ మించి ఉన్న కొనుగోలు చేసేందుకు సీసీఐ ముందుకు రావాలన్నారు. ఇక్కడ బిజెపి ఎంపీ, ఎమ్మెల్యేలున్న కనీసం కేంద్ర మంత్రులతో మాట్లాడి రైతులకు మద్దతు ధర కల్పించేలా కృషి చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ఎన్నికలు పక్కనపెట్టి రైతు సమస్యలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజర్షి షా తో ఫోన్ లో మాట్లాడి..పత్తిలో తేమ శాతం 20కి మించి ఉన్నా కూడా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే తుఫాన్ ప్రభావంతో రైతులు తీవ్ర నష్టాల్లో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నవీన్ చారి,లలిత యాదవ్, వేణుగోపాల్ యాదవ్, అసపు ప్రమోద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్ల మీర్జాగూడ బస్సు ప్రమాదం దురదృష్టకరం

**మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి**

**క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి**

**వారి ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నా**

**పాలేరు మాజీ శాసనసభ్యులు కందాళ ఉపేందర్ రెడ్డి**



**ఖమ్మం బ్యూరో, 03 నవంబర్ (కెరటం న్యూస్):** చేవెళ్ల మండలం మీర్జాగూడ వద్ద రోడ్డు బస్సు రోడ్డు ప్రమాద ఘటన చోటు చేసుకోవడం దురదృష్టకరమని, ఈ ప్రమాదంలో 21 మంది ప్రయాణికులు చనిపోవడం అత్యంత బాధాకరమని మాజీ కందాళ ఉపేందర్ రెడ్డి పేర్కొన్నారు. బస్సు ప్రయాణికులపై టిప్పర్ లో ఉన్న కంకర పడిపోవడంతో 21 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయిన తీవ్ర విషాద ఘటన కలిచివేసిందని, మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, ఈ తరహా ఘటనలు చోటు చేసుకోకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# సిపిఎం నాయకులకు మతిభ్రమించింది

**▶▶ హత్య రాజకీయాలు చేసేది సిపిఎం**

**▶▶ ప్రజల సంక్షేమం కోసం పనిచేసేది కాంగ్రెస్**

**▶▶ భట్టి విక్రమార్క పై ఆరోపణలు సిపిఎం విజ్ఞతకే వదిలేస్తున్నాం**

**▶▶ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ దుర్గాప్రసాద్**



**చింతకాని, 03 నవంబర్ (కెరటం న్యూస్):** సిపిఎం నాయకులకు మతిభ్రమించి డిప్యూటీ సీఎం పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ దుర్గాప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రం చింతకానిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతర్లపాడు గ్రామానికి చెందిన సిపిఎం నాయకులు సామినేని రామారావు హత్యను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది అన్నారు. స్పందించిన డిప్యూటీ సీఎం హత్య చేసిన దుండగులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని పోలీస్ యంత్రాంగాన్ని ఆదేశించారన్నారు. హత్య రాజకీయాలకు కాంగ్రెస్ పార్టీ దూరమని, రాష్ట్ర ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ఎజెండా అని తెలియజేశారు. హత్య రాజకీయాలు చేస్తున్నది ఎవరు గోకినపల్లి తెల్దారుపల్లి గ్రామాల్లో జరిగిన ఘటనలే నిదర్శనమని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ, పథకాలకు ఆకర్షితులైన ప్రజలు కాంగ్రెస్ పార్టీలో చేరుతుంటే జీర్ణించుకోలేక సిపిఎం కాంగ్రెస్ పార్టీపై హత్య రాజకీయాల ముద్ర వేయడం ఏమిటని ప్రశ్నించారు. సిపిఎం పార్టీ ఆరోపించినట్లు కాంగ్రెస్ పార్టీ హత్య రాజకీయాలు చేయదని కాంగ్రెస్ పార్టీపై హత్య రాజకీయాలు ఆరోపించిన గ్రామాల్లో భట్టి విక్రమార్కకు బ్రహ్మరథం పట్టి గడచిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయా గ్రామాల్లో అధిక మెజార్టీ వచ్చింది తెలియజేశారు. పోలీసు యంత్రాంగం సమర్థవంతంగా పనిచేస్తుందని పోలీసు ఉన్నతాధికారులు త్వరలోనే హత్య మిస్టరీని ఛేదిస్తారని స్పష్టం చేశారు. సామినేని రామారావును హత్యగావించిన నిందితులు ఎంతటి వారైనా శిక్ష తప్పదని అందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందన్నారు. సీనియర్ నాయకులు హత్య గావించబడినప్పుడు సమన్వయంతో ఉండాలి కానీ రాజకీయ ప్రాబల్యం కోసం ఇతర పార్టీలపై నిందలు వేయడం ఎంతవరకు సమంజసం అని సిపిఎం పార్టీని ప్రశ్నించారు. అభివృద్ధి ప్రదాత డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క హత్య రాజకీయాలను సహించడని సుస్పష్టం చేశారు. ఇప్పటికైనా సిపిఎం కాంగ్రెస్ పార్టీపై నిరాదరణమైన ఆరోపణలు, నిందారోపణలు, అసత్య ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అంబటి వెంకటేశ్వరరావు జిల్లా నాయకులు పుచ్చకాయల వీరభద్రం, బొడ్డు బొందయ్య మండల నాయకులు కొప్పుల గోవిందరావు కన్యబోయిన గోపి, కూరపాటి కిషోర్, బందెల నాగార్జున, చట్టు వెంకటేశ్వర్లు కాంగ్రెస్ పార్టీ మీడియా ఇంచార్జ్ ఓర్సు వీరభద్రం, ఎస్.కె అబ్దుల్ మజీద్ పాషా, ఎస్కే కాసిం, దేశపోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ మహిళలకు ఉపాధి దిశగా నూతన అవకాశాలు

**-ఫౌండర్ డైరెక్టర్ దేవకీ వాసుదేవ రావు**





**ఖమ్మం బ్యూరో, 03 నవంబర్ (కెరటం న్యూస్):** నిరుద్యోగ మహిళలకు ఉపాధి మార్గం చూపించే దిశగా వివేకానంద ఇన్స్టిట్యూట్ అఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ (విహే), ఖమ్మంలో కొత్త టైలరింగ్ నైపుణ్య శిక్షణ బ్యాచ్ ప్రారంభమైంది. ఫౌండర్ డైరెక్టర్ దేవకి వాసుదేవరావు ఆధ్వర్యంలో, సెక్రటరీ గన్నవరపు చంద్రశేఖర్ ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిక్షణలో 25 మంది మహిళలు పాల్గొంటున్నారు. 45 రోజులపాటు సాగే ఈ కోర్సులో ఆధునిక టైలరింగ్ పద్ధతులు, కుట్టు నైపుణ్యాలు, దుస్తుల డిజైన్ పద్ధతులు, స్వయం ఉపాధి అవకాశాలపై ప్రాక్టికల్ ట్రైనింగ్ అందించ బడుతుంది. ఈ శిక్షణ పూర్తిచేసిన మహిళలు స్వతంత్రంగా బొటిక్‌లు ప్రారంభించ గలరు లేదా గార్మెంట్స్ రంగంలో ఉద్యోగావకాశాలను పొందగలరు. సెక్రటరీ చంద్రశేఖర్ మాట్లాడుతూ 2012లో ప్రారంభమైన విహే ఇప్పటి వరకు 15 వేలు పైచిలుకు యువతకు నైపుణ్య శిక్షణ అందించి, అనేక రంగాల్లో ఉపాధి కల్పించింది. నైపుణ్య శిక్షణ ఉద్యోగానికి మాత్రమే కాకుండా, స్వయం ఉపాధి కోసం కూడా జీవనాధారంగా మార గలదు. కాబట్టి యువత, మహిళలు ఇలాంటి కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టి. రామిరెడ్డి, చైతన్య కోషోర్, బన్సీలాల్, అశోక్, శిక్షణ నిర్వాహకురాలు ఉపేంద్రమ్మ మరియు శిక్షణార్థులు పాల్గొన్నారు.

## వన్డే ప్రపంచ కప్ లో భారత మహిళా జట్టు విజయం

**మాజీ ఎంపీ నామ అభినందనలు**



**హైదరాబాద్, 03 నవంబర్ (కెరటం న్యూస్):** భారత మహిళ క్రికెట్ జట్టు వన్డే ప్రపంచ కప్ తొలి సారిగా గెలిచి భారత క్రీడా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించారని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా భారత మహిళ క్రికెట్ జట్టుకు నామ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. మహిళలు క్రీడా రంగంలో చూపుతున్న ప్రతిభ దేశానికి గర్వకారణమని, ఈ విజయం భారత మహిళా శక్తి స్ఫూర్తిని ప్రపంచానికి తెలియజేసిందని ఆయన తెలిపారు. ప్రపంచ కప్ టోర్నీలో వరుసగా మూడు మ్యాచ్ ల్లో ఓడిన మహిళా జట్టు ధైర్యంగా చివరి దాకా పోరాడారని కొనియాడారు. సెమీస్ లో ఆస్ట్రేలియా పైన రికార్డు రన్స్ ఛేదన చేసి వారిని ఓడించటంతో పాటు, ఫైనల్ మ్యాచ్ లో దక్షిణాఫ్రికా పై జట్టులోని ప్రతీ ఒక్కరు సమిష్టిగా రాణించి ఘన విజయం సాధించినందుకు దేశ ప్రజలంతా గర్వపడుతున్నారన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాగే అంతర్జాతీయ వేదికపై భారత్ జెండాను ఎగురవేయాలని ఆకాంక్షిస్తూ, కోచ్, మేనేజ్‌మెంట్, సపోర్ట్ స్టాఫ్ అందరికీ కూడా ఆయన అభినందనలు తెలిపారు.

## జూబ్లీహిల్స్ లో బీజేపీని గెలిపించండి

**బిజెపి రాష్ట్ర నాయకులు తాండ్ర వినోద్ రావు**



**హైదరాబాద్ బ్యూరో, 03 నవంబర్ (కెరటం న్యూస్):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిని గెలిపిస్తే నియోజకవర్గం సమగ్రంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని అందుకే బిజెపి అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ బిజెపి రాష్ట్ర నాయకులు ఖమ్మం ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్ రావు అన్నారు. జూబ్లీహిల్స్ సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ హఠాత్ మరణంతో అక్కడ ఉప ఎన్నికలు అనివార్యమైన సందర్భంగా భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డికి పార్టీ అధిష్టానం టికెట్ ఇవ్వడం జరిగింది. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు నారపరాజు రామచంద్రరావు



జూబ్లీహిల్స్ అసెంబ్లీ పరిధిలోని కొంత ప్రాంతానికి గత పార్లమెంటు ఎన్నికలలో ఖమ్మం నుండి పోటీ చేసిన తాండ్ర వినోద్ రావుకి ఇన్చార్జిగా బాధ్యతలు ఇవ్వడం జరిగినది. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు నారపరాజు రామచందర్ రావు సారధ్యంలో లంకల దీపక్ రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని ప్రతి బూతులో, ప్రతి గడపకు విస్తృత స్థాయిలో నిర్వహిస్తున్నామని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం, మరియు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు జూబ్లీహిల్స్ లో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయలేదని, అలాగే కేంద్ర ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేస్తున్నారని, నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రజల కొరకు అనేక సంక్షేమ పథకాలను తీసుకొచిన వాటిని ప్రజలకు వినియోగించడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి విఫలమయ్యాడని వివరిస్తూ ప్రచారాన్ని నిర్విరామంగా నిర్వహిస్తున్నామన్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని ముందుండి నడిపిస్తున్నారని, కేంద్రం నుండి అనేక వందల కోట్ల రూపాయలు విడుదల చేయిస్తున్న ఇక్కడి రేవంత్ సర్కార్ వాటిని వినియోగించడం లో విఫలమయ్యారని ఎద్దేవా చేశారు. రేపు 11వ తారీఖున జరిగే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజలు బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డికి పట్టం కట్టాలని వారు ప్రజలను కోరారు. అలాగే ప్రచారంలో ఏ డివిజన్ కి వెళ్ళినా, ఏ ప్రాంతానికి వెళ్ళినా ప్రజలు భారతీయ జనతా పార్టీ ని విశేషంగా ఆదరిస్తున్నారని ఇది చాలా సంతోషకరమైన విషయమని, అలాగే ప్రజల ఆదరాభిమానాలు చూస్తుంటే రాబోయే కాలంలో భారతీయ జనతా పార్టీ తిరుగులేని శక్తిగా నిలుస్తుంది అని తాండ్ర వినోద్ రావు ఆశాభావం వ్యక్తం చేశారు.

## చేవెళ్లలో ఘోర రోడ్డు ప్రమాదం

**మాజీ ఎంపీ నామ దిగ్భ్రాంతి**



**హైదరాబాద్ బ్యూరో, 03 నవంబర్ (కెరటం న్యూస్):** చేవెళ్ల మండలం మీర్జాగూడ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం పట్ల బిఆర్ఎస్ పార్టీ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తాండూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సును కంకర లోడుతో వెళ్తున్న టిప్పర్ ఢీకొట్టడంతో పలువురు మృతిచెందిన విషయం తీవ్రంగా కలిచివేసిందని పేర్కొన్నారు. బాధితుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అధికారులు సహాయక చర్యలు చేపట్టి, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని నామ కోరారు. ఈ ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలకు నష్టపరిహారం తక్షణమే అందించాలన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా రోడ్డు భద్రతపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

## భారత మహిళా జట్టు చరిత్ర సృష్టించింది

**బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు**



**ఖమ్మం బ్యూరో, 03 నవంబర్ (కెరటం న్యూస్):** భారత మహిళా క్రికెట్ జట్టు వన్డే ప్రపంచ కప్‌ను తొలిసారిగా కైవసం చేసుకొని దేశ క్రీడా చరిత్రలో సువర్ణపుటలను రాసిందని భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు అన్నారు. ఈ అద్భుత విజయంతో భారత త్రివర్ణ పతాకాన్ని అంతర్జాతీయ వేదికపై గర్వంగా ఎగురవేసిన మహిళా యోధాంగనలకు దేశ ప్రజల తరపున హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నానని తెలిపారు. మహిళలు క్రీడా రంగంలో చూపుతున్న అచంచల ప్రతిభ దేశ గౌరవాన్ని మరింత ఎత్తుకు చేర్చిందని ఆయన పేర్కొన్నారు. ఈ విజయం భారత మహిళా శక్తి సామర్థ్యానికి ప్రతీకగా నిలిచిందని, ప్రపంచానికి స్ఫూర్తినిచ్చే ఘనత సాధించిందని ప్రశంసించారు. టోర్నీలో ప్రారంభ దశలో వరుసగా మూడు పరాజయాలను ఎదుర్కొన్నప్పటికీ, ఆత్మవిశ్వాసం కోల్పోకుండా ధైర్యంగా పోరాడి చివరికి విజేతలుగా నిలిచిన ఈ జట్టు నిజమైన యోధుల బృందమని కొనియాడారు. సెమీఫైనల్లో ఆస్ట్రేలియాపై రికార్డు స్థాయిలో రన్స్ ఛేదన చేసి వారిని ఓడించడం, ఫైనల్లో దక్షిణాఫ్రికాపై సమిష్టి కృషితో సాధించిన ఘనత చరిత్రలో చిరస్మరణీయమని తెలిపారు. దేశ యువతకు ఈ విజయం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొంటూ, భవిష్యత్తులో కూడా అంతర్జాతీయ వేదికపై భారత జెండాను మరెన్నో సార్లు ఎగురవేయాలని ఆకాంక్షించారు. ఈ విజయానికి వెనుక ఉన్న కోచ్, మేనేజ్‌మెంట్, సపోర్ట్ స్టాఫ్ అందరికీ కూడా ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళా శక్తి క్రీడా రంగంలో సింహస్వప్నాన్ని సాకారం చేసిన ఈ విజయం, దేశవ్యాప్తంగా ప్రతి భారతీయుని గుండెల్లో గర్వాన్ని నింపిందని నెల్లూరి కోటేశ్వరరావు పేర్కొన్నారు.

కెరటం న్యూస్

మంగళవారం 04 నవంబర్ 2025

# సింథటిక్ ట్రాక్ 9 కోట్ల నిధులపై విచారణ జరిపించాలి

**- డివిజన్ సెక్రటరీ వై విక్రమ్**




**ఖమ్మం బ్యూరో, 03 నవంబర్ (కెరటం న్యూస్):** ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో క్రీడాకారుల కోసం తలపెట్టిన సింథటిక్ ట్రాక్ కోసం మున్సిపల్ కార్పొరేషన్ నుంచి 9 కోట్లు విడుదల చేసిన నిధుల పనులపై సమగ్ర విచారణ జరిపించాలని సిపిఎం పార్టీ ఖమ్మం డివిజన్ సెక్రటరీ వై విక్రమ్ డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం పార్టీ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ బృందం పటేల్ స్టేడియంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వై విక్రమ్ మాట్లాడుతూ తెలంగాణలో ప్రధానమైన నగరాల్లో భాగంగా ప్రభుత్వ నిధులతో క్రీడాకారులకు తగిన నైపుణ్యం పెరగటానికి నిధులు విడుదల చేశారని దానిలో భాగంగా ఖమ్మం పటేల్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ కోసం తొమ్మిది కోట్ల రూపాయలు కేటాయించారని తెలిపారు. ట్రాక్ నిర్మాణ పనులు కోసం నిధులు ఇంత పెద్ద ఎత్తున విడుదల చేసినా ట్రాక్ పనులు నత్తనడకన సాగుతున్నాయి అని విమర్శించారు. ట్రాక్ పనులు కోసం ఖర్చు తక్కువగా వుంటుంది అని అధికారులకు తెలిసినా నిధులు అధికంగా విడుదల కావడం పైగా నత్తనడకన పనులు కొనసాగటంపై విచారణ జరిపించాలి అని డిమాండ్ చేశారు. గతంలో కూడా ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్లో కూడా రెండు కోట్లతో చేపట్టిన పనుల్లో దుర్వినియోగం జరిగింది అని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో పటేల్ స్టేడియం ట్రాక్ నిధులపై, జరిగిన పనులపై విచారణ జరిపించాలి అని డిమాండ్ చేశారు. కమిషనర్, మేయర్, అధికారులు జరుగుతున్న పనుల నాణ్యతపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మీరా సాహిబ్, దొంగల తిరుపతిరావు, ఎస్ నవీన్ రెడ్డి, పి రమ్య, యర్రా రంజిత్ , జె వెంకన్న బాబు, గాలి వెంకట్రాది, పోతురాజు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# తండ్రికి టాటా.. చెప్పి..!

## బస్సు ప్రమాదంలో విద్యార్థిని మృతి

## కరణ్ కోట్ కు చెందిన ముస్కాన్ గా గుర్తింపు



**వికారాబాద్, 03 నవంబర్ (కెరటం న్యూస్):** వికారాబాద్ జిల్లా కరణ్ కోట్ గ్రామానికి చందిన ముస్కాన్ కి బస్ఎక్కించేందుకు వచ్చిన తండ్రికి టాటా చెప్పిన కొన్ని గంటల్లోనే కన్నుమూసింది. చేవేళ్ల మండలంలో జరిగిన టిప్పర్ లారీ, ఆర్టీసీ బస్సు ప్రమాదంలో తాండూరు మండలానికి చెందిన కాలేజీ విద్యార్థిని మృతి చెందింది. మండలంలోని కరణ్ కోట్ గ్రామానికి చెందిన చాంద్ పాష స్టోన్ వ్యాపారిగా ఉన్నారు. మండలంలోని గౌతాపూర్ గ్రామంలో ఇళ్లు నిర్మించుకుని అక్కడే ఉంటున్నారు. వారి కూతురు ముస్కాన్(21) హైదరాబాద్ లోని కోఠి ఉమెన్స్ కాలేజీలో డిగ్రీ చదువుతోంది. సెలవులు ఎప్పుడు వచ్చినా సరే, ఆదివారం రోజు కూడా గ్రామానికి వచ్చింది అలా సెలవులో వచ్చిన ముస్కాన్ సోమవారం తాండూరు ఆర్టీసీ బస్సులో హైదరాబాద్ కు బయల్దేరింది. అంతకుముందే చాంద్ పాష తన కూతురు ముస్కాన్ ను బస్సులో ఎక్కించారు. తన కోసం వచ్చిన తండ్రికి బస్సులో నుంచి టాటా చెప్పి ముస్కాన్ బయల్దేరింది. కాని చేవేళ్ల మండలంలో జరిగిన బస్సు ప్రమాదంలో ముస్కాన్ మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

# ఆర్.ఎం.పి, పిఎంపీలకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇచ్చేవరకు సంఘటతంగా పోరాడుదాం

## ఆర్ఎంపి, పిఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ పాలకుర్తి నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ సింగారపు భీమయ్య



**తొర్రూరు, 03 నవంబర్ (కెరటం న్యూస్):** ఆర్ఎంపీపీ ఎంపీ గ్రామీణ వైద్యులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇచ్చేవరకు సంగటితంగా పోరాడదాం అని ఆర్.ఎం.పి.ఎం.పి వెల్ఫేర్ అసోసియేషన్ పాలకుర్తి నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ సింగారపు భీమయ్య అన్నారు. సోమవారం తొర్రూరు మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ వైద్యుల సంఘాలు ఎన్నున్నా ఏది ఏమైనా సంఘాలన్నీ ఒక తాటిపైకి వచ్చి గ్రామీణ వైద్యులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు అందజేసేంతవరకు కలిసి పోరాటాలు చేయాలని కోరారు. నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నా నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ గా అప్పజెప్పిన నా బాధ్యతను నిబద్ధతతో సక్రమంగా నిర్వర్తిస్తూ ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యల పైన అనునిత్యం పోరాటం చేస్తానని అన్నారు.

# పేద విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు

## ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలి

## బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు



**ఖమ్మం బ్యూరో, 03 నవంబర్ (కెరటం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు తీవ్రంగా విమర్శించారు. సోమవారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు ఎనిమిది వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. పేద విద్యార్థుల భవిష్యత్తు నిలిచిపోయే పరిస్థితి వచ్చింది. అయినా ప్రభుత్వం మాత్రం నిశ్చలంగా ఉంది," అని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విద్యార్థులకు పూర్తి పారదర్శకంగా నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు ఆ హామీని విస్మరించిందని ఆయన విమర్శించారు. "వారు ఇచ్చిన టోకెన్ల ఆధారంగా చెల్లింపులు జరగాల్సింది పోయి, నిధుల లేమి పేరుతో కాలయాపన చేస్తున్నారు. ఇది విద్యా రంగానికి తీవ్రమైన నష్టం," అని పేర్కొన్నారు. గతంలో విద్యాసంస్థల యాజమాన్యాలు బంద్ చేపట్టి, సంవత్సరం రోజులపాటు పోరాడి ప్రభుత్వాన్ని కదిలించగా, ప్రభుత్వం రూ.1,200 కోట్లు విడుదల చేస్తామని ప్రకటించి మాట తప్పిందని ఆయన గుర్తుచేశారు. "మళ్లీ అదే పరిస్థితి పునరావృతమవుతోంది. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల విద్యాసంస్థలు మళ్లీ బంద్ దిశగా వెళ్తున్నాయి. దీని ఫలితంగా పేద విద్యార్థులు తమ చదువులపై దెబ్బతింటారు," అని కోటేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తు కాపాడుకునే బాధ్యత ప్రభుత్వానిదేనని ఆయన హితవు పలికారు. "ముఖ్యమంత్రి స్వయంగా విద్యాశాఖను తన ఆధీనంలో ఉంచుకున్నప్పటికీ పేద విద్యార్థులకు ఏ మాత్రం భరోసా కల్పించలేక పోతున్నారు. కనీసం ఇప్పటికైనా ప్రభుత్వం ఫీజు చెల్లింపులపై గ్యారంటీ ఇవ్వాలి. విద్యార్థులు విద్యను వదిలేయకుండా చర్యలు తీసుకోవాలి," అని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విడుదల కోసం విజ్ఞప్తి చేస్తే, ప్రభుత్వం విజిలెన్స్ దాడుల పేరుతో బెదిరించడం అత్యంత దుర్మార్గమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇది ప్రజాస్వామ్య విధానాలకు విరుద్ధం. పేదల విద్యను బంధీ చేయడం అన్యాయం. ఈ విధానాలు కొనసాగితే గత ప్రభుత్వానికి పట్టిన గతి, ఈ ప్రభుత్వానికీ తప్పదని ప్రజలు చాటుతారు," అని హెచ్చరించారు. తక్షణమే ప్రభుత్వం విద్యాసంస్థల ప్రతినిధులతో చర్చలు జరిపి, బకాయిలు విడుదల చేసి సమస్యను పరిష్కరించాలని నెల్లూరి కోటేశ్వరరావు స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ అరాచకాలకు అడ్డు, అదుపు లేకుండా పోయింది

**కమల్ రాజు, సండ్ర వెంకటవీరయ్య**

**సామినేని రామారావు హత్య పక్క దారి పట్టించే కుట్ర జరుగుతుంది**

**కేవలం మధిర నియోజకవర్గంలోనే హత్యలు ఎందుకు జరుగుతున్నాయి..?**

**భట్టి సమాధానం చెప్పాలి**

**హత్య జరిగి మూడు రోజులైన నిందితులను ఎందుకు పట్టుకోలేదు..?**

**సిపిఎం నేతలు మడుపల్లి గోపాల్ రావు,మాధినేని రమేష్**



**చింతకాని, 03 నవంబర్ (కెరటం న్యూస్):** సిపిఎం సీనియర్ నేత, మాజీ సర్పంచ్ సామినేని రామారావు హత్య చాలా దారుణమని బిఆర్ఎస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య,మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు ఖండించారు. సోమవారం వారి కుటుంబాన్ని పరామర్శించి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుండి మధిర నియోజకవర్గంలో కాంగ్రెస్ శ్రేణుల ఆరాచకాలు పెరిగిపోయాయని,ఎవరి అండతో హత్యలు జరుగుతున్నాయని ప్రశ్నించారు.హత్య రాజకీయాలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సామినేని రామారావు హత్యను పక్కదారి పట్టించే కుట్ర జరుగుతుందని వారన్నారు. విచారణ పేరుతో రామారావు గారి కుటుంబాన్ని పోలీసులు వేధిస్తున్నారని అది సరైంది కాదని వారు అన్నారు.మధిర నియోజకవర్గంలో ప్రతిపక్షం లేకుండ చేయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ హత్య రాజకీయాలు చేస్తుంది తీవ్ర విమర్శలు చేశారు. పోలీసులు అధికార పార్టీ ఒత్తిడికి లొంగకుండ,నిష్పక్షపాతంగా విచారణ జరిపి కుటుంబానికి తగు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.





ఈ మీడియా సమావేశంలో సిపిఎం పార్టీ మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, మాదినేని రమేష్, వత్సవాయి జానకి రామయ్య,బిఆర్ఎస్ మండల కార్యదర్శి వెంకట రామయ్య, సీపీఎం మండల కార్యదర్శి రచాబంటి రాము, నాయకుల కొల్లి బాబు,సామినేని అప్పారావు, వెంకటేశ్వర్లు, పానకాల రావు,వేముల నర్సయ్య, చావ హనుమంత్ రావు, కోపూరి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలోని అన్ని చేపల చెరువులు రిజర్వాయర్లలో ఉచిత చేప పిల్లల పంపిణీ




**సూర్యాపేట, 03 నవంబర్ (కెరటం న్యూస్):** జిల్లాలోని అన్ని చేపల చెరువులు,రిజర్వాయర్లలో ఉచిత, చేప పిల్లల పంపిణీ.సంసిద్ధంగా ఉన్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి, వాకిటి శ్రీహరికి వివరించారు.సోమవారం రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం పై హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, మత్స్య శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, సూర్యాపేట జిల్లాలో చేప పిల్లల పంపిణీకి రూట్ మ్యాప్ తో సహా సంసిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం, జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో ఇదే అంశంపై సమీక్ష నిర్వహిస్తూ, ఉచిత చేప పిల్లల పంపిణీలో భాగంగా చెరువులు, రిజర్వాయర్లలో చేప పిల్లలను వదిలేందుకుగాను,నియోజకవర్గాల వారీగా చేప పిల్లల స్టాకింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని, ఈ కమిటీలలో గ్రామ సెక్రటరీలు, ఏ. ఈ. ఓ లు, ఎం.పీ.డీ.వో లను, భాగస్వాములను చేయాలని చెప్పారు. ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం పై ప్రణాళిక రూపొందించి కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు, సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అంతకుముందు మత్స్య శాఖ మంత్రి వాకటి శ్రీహరి, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ల తో మాట్లాడుతూ, ఈ వానాకాలం జిల్లాలోని చేపల చెరువులలో, ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం, ప్రారంభించుటకు రూట్ మ్యాప్ తయారు చేసుకుని, సిద్ధంగా ఉండాలని, స్థానిక ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం ప్రారంభించాలని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని చెరువులలో, రిజర్వాయర్లలో ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం నవంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని, మంత్రి ఆదేశించారు. ఇందుకు గాను జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఇట్టి బృహత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ,ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులను, ఇరిగేషన్ అధికారులను, మత్స్య సహకార సంఘాలను, గ్రామపంచాయతీ సిబ్బందిని భాగస్వాములు చేయాలని చెప్పారు.తెలంగాణలో జీవనదులైన గోదావరి, కృష్ణ ఉన్నందున వాటి క్రింద ఉన్న రిజర్వాయర్లలో, చెరువులలో చేపల ఉత్పత్తి గణనీయంగా పెంచాలని, మన రాష్ట్రం నుండి చేపలను ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు ఎగుమతి చేసే విధంగా, తెలంగాణ రాష్ట్రం చేపల ఉత్పత్తిలో మొదటి స్థానంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలలో చేపల మార్కెట్లు ఏర్పాటు చేయుటకు అనుకూలమైన స్థలాన్ని గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపితే, చేపల మార్కెట్లు నిర్మిస్తామని తెలిపారు. తెలంగాణలో వరి ధాన్యం, అత్యధికంగా పండినట్లుగానే, చేపల ఉత్పత్తి కూడ అదేవిధంగా ఉండాలని మంత్రి కలెక్టర్లకు సూచించారు.జిల్లా నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్ కు అదనపు కలెక్టర్, కె. సీతారామారావు, జిల్లా మత్స్యశాఖ అధికారి బి. నాగులు, డి.పి.ఓ యాదగిరి, జిల్లా ఇరిగేషన్ అధికారి యాదగిరి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# రాజీ మార్గమే.. రాజమార్గం

## జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ రాజగోపాల్

వనం నాగయ్య, కెరటం న్యూస్ ప్రత్యేకం

నవంబర్ 15న ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు, రాజీ చేసుకోవాలను కునే వారు దీనిని సద్వినియోగం చేసుకొని కోర్టు కేసుల నుంచి ఉపశమనం పొందాలని జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. రాజ గోపాల్ అన్నారు. ఖమ్మం జిల్లా కోర్టులోని న్యాయ సేవ సదన్ లో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహణపై జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సోమవారం పోలీసు, బ్యాంకర్లు, చిట్ ఫండ్ ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. రాజ గోపాల్ మాట్లాడుతూ... లీగల్ సర్వీస్ అథారిటీ తరఫున ప్రతి మూడు నెలలకు ఒకసారి జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం



జరుగుతుందని తెలిపారు. రాజీ చేసుకోవాలనుకునే క్రిమినల్, ఇతర కేసులకు లోక్ అదాలత్ ఒక వేదికగా నిలుస్తుందని అన్నారు. యాక్సిడెంట్, భార్యాభర్తల వివాదాలు, చెక్ బౌన్స్ వంటి వివిధ కేసులను లోక్ అదాలత్ లో రాజీ చేసుకోవచ్చని అన్నారు. ప్రమాద కేసులు లోక్ అదాలత్ లో రాజీ చేసుకుంటే ఒకేసారి పరిహారం అందించడం జరుగు తుందని ఆయన తెలిపారు. లోక్ అదాలత్ లో పరిష్కారం చేసుకున్న కేసుల్లో మళ్ళీ ఉన్నత కోర్టులకు అప్పీల్ చేసుకునే అవకాశం ఉండదని అన్నారు. లోక్ అదాలత్ పట్ల గ్రామీణ ప్రజలకు విస్తృతంగా ప్రచారం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇందుకు సంబంధించి కెరటం న్యూస్ అందిస్తోన్న వివరాలు ఇలా ఉన్నాయి...

కోర్టు లో పెండింగ్లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించు కునేందుకుగాను లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా జడ్జి రాజగోపాల్ తెలిపారు. నవంబర్ 15న ఖమ్మం జిల్లాలో స్పెషల్ లోక్ అదాలత్‌ను విజయవంతంగా నిర్వహించుకొని సాధ్యమైన మేరకు ఎక్కువ కేసులు పరిష్కరించుకొని కక్షిదారులకు కేసుల నుండి విముక్తి కలిగిద్దామని ఆయన అన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా కక్షిదారులకు, ఇరు వర్గాలకు మానసిక స్వాంతన కలిగిద్దామన్నారు. ప్రతి మూడు నెలలకు ఓసారి సుప్రీంకోర్టు ఆదేశానుసారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించు కుంటున్నామని అన్నారు. గత సెప్టెంబర్ నెలలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించుకున్నామని అలాగే నవంబర్ 15న స్పెషల్ నిర్వహించు కుంటున్నామని ఈ విషయాన్ని సాధ్యమైనంత వరకు ఎక్కువ మందికి తెలిసేలా కృషిచేసి కేసుల పరిష్కారానికి అందరూ కలిసి పని చేయాలన్నారు. ఇప్పటివరకు గడిచిన లోక్ అదాలత్‌లో అనేక కేసులు పరిష్కరించుకున్నామని అయినప్పటికీ వేలాది కేసులు పెండింగ్లో ఉండటం వల్ల కోర్టులపై పనిభారం పడుతుందన్నారు. పోలీస్ శాఖ, న్యాయవాదుల సహకారంతో కేసులను పరిష్కరించేందుకు వీలు కలుగుతుందన్నారు. అధిక కేసుల వల్ల కోర్టులపై తీవ్రమైన ఒత్తిడి పని భారం కలిగి ఉంటుందన్నారు. గౌరవ సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేకంగా లోక్ అదాలత్ నవంబర్ 15వ తేదీ నిర్వహించు కుంటున్నామని తెలిపారు. కాంపౌండబుల్ క్రిమినల్ అఫెన్సెస్ (రాజీ చేసుకోదగిన కేసులు) అది ఏ స్థాయిలో ఉన్నా.. కొత్త కేసులు కానీ, సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న కేసులకు గానీ విముక్తి కలిగించేందుకు గాను గౌరవ చీఫ్ జస్టిస్ ఈ కార్యక్రమాన్ని చేపట్టారని ఆయన తెలిపారు. ఖమ్మం బార్ అసోసియేషన్ సభ్యులతో చర్చించగా వారి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. ఖమ్మం కోర్టులో కాంపౌండబుల్ కేసులకు సంబంధించి 3,650 వరకు ఉన్నాయని ఇన్ని కేసులను సాక్షులను విచారించడం, స్టడీ చేయడం, తీర్పులు ఇవ్వడం అంటే కొన్ని ఏళ్ల పాటు కాలయాపన జరిగే అవకాశం ఉందన్నారు. అంతే కాకుండా ఈ కేసుల్లో నేరం మోపబడిన నిందితుల కుటుంబాల్లో ఆర్థికంగా, మానసికంగా, శారీరకంగా ఎంతో శ్రమించాల్సి ఉంటుందని న్యాయమూర్తి రాజగోపాల్ తెలిపారు. క్షణికావేశంలో, తెలిసో తెలియకో, పాత కక్షలు నేపథ్యంలో, గొడవలతో క్రిమినల్ చర్యలకు పాల్పడితే పోలీసు కేసులు అవుతాయని, ముద్దాయిగా శిక్ష పడితే ఆ కుటుంబాల మధ్య మరింత కక్షలు పెరుగుతాయని న్యాయమూర్తి తెలిపారు. అదే కేసులో ఇరువర్గాలు లోక్ అదాలత్ ద్వారా రాజీ పడితే ఇరువర్గాల్లో స్నేహపూర్వక



వాతావరణం చిగురిస్తుందన్నారు. గ్రామాలు, పట్టణాలు శాంతియుతంగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. శాంతిభద్రత లేని చోట అభివృద్ధికి తావు లేదని న్యాయమూర్తి రాజగోపాల్ తెలిపారు. కేసుల్లో శిక్షలు పడితే పిల్లల భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. జిల్లాలోని పెండింగ్ కేసులో విషయంలో నెగోషియబుల్ ఇనుస్ట్రుమెంట్ యాక్ట్ కింద (చెక్కు బౌన్స్ కేసులు) 5,536 కేసులు ఉన్నాయని ఆయన తెలిపారు. ఇవన్నీ రాజీ పడ తగిన కేసులేనని న్యాయమూర్తి సూచించారు. ఫ్యామిలీ కోర్టులో ఇటీవల కాలంలో భార్యాభర్తలకు సంబంధించి విపరీతమైన కేసులు వస్తున్నాయనీ, కుటుంబ తగాదాలు, డొమెస్టిక్ వైలెన్స్, వివాహాన్ని రద్దు చేయమని, విడాకులు ఇప్పించాలని వివిధ కారణాలతో కుటుంబాలలో అలజడి పెరుగుతోందన్నారు. భార్యాభర్తలు పంథాలను తగ్గించుకోవాలని అలాంటి వారికి లోకదాలత్ కేసులు చక్కగా ఉపయోగపడుతుందని అన్నారు. విలేకరుల సమావేశంలో ట్రాఫిక్, డ్రంక్ అండ్ డ్రైవ్, ఫైనాన్స్, మెగాసేబుల్ ఇన్స్ట్రుమెంట్ యాక్ట్, తదితర కేసులకు సంబంధించి వివరించారు. ఈ సమావేశంలో మొదటి అదనపు జిల్లా జడ్జి ఉమ, న్యాయమూర్తులు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి. వెంకటేశ్వర రావు, నామినేటెడ్ సభ్యులు న్యాయవాదులు శ్రీనివాసరావు, సంధ్యారాణి, పోలీస్, ఎక్సైజ్, బ్యాంక్ అధికారులు, న్యాయవాదులు, చిట్ ఫండ్, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

